# నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి జన్మదిన కానుక

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పీఎస్ఆర్ యువ నేస్తం పేరిట ఆన్‌లైన్‌లో ఎన్ని లక్షల మందికైనా ఉచిత శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. . ప్రతిష్ఠాత్మక ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఈరోజు నుంచి ఏడాది పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందని అవసరమైతే ఈ శిక్షణా కాలాన్ని పొడిగిస్తామని తెలిపారు.



మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

**నిరుద్యోగ యువతకు అండగా నిలవడమే లక్ష్యం..**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు నాణ్యమైన శిక్షణ అందించి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. గత 30 ఏళ్లుగా ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ ఎంతోమంది ప్రతిభావంతులను తీర్చిదిద్దిందని, ఐఏఎస్ వంటి ఉన్నతస్థాయి ఉద్యోగాలు సాధించేందుకు కూడా అభ్యర్థులకు మార్గనిర్దేశం చేసిందని తెలిపారు. ఈ సంస్థలో కరీం, కృష్ణారెడ్డి, మేముల సైదులు వంటి అనుభవజ్ఞులైన అధ్యాపకులు, ఫ్యాకల్టీ సభ్యులు ఈ శిక్షణ కార్యక్రమంలో భాగస్వాములుగా ఉండటం అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు.

**గత అనుభవమే 'యువ నేస్తం'కు స్ఫూర్తి..**

2013లో రాజకీయాల్లోకి ప్రవేశించి, 2014లో ఎంపీగా ఎన్నికైన అనంతరం 2016లో ఖమ్మం ప్రాంతంలో నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రిగారు గుర్తుచేశారు. అప్పట్లో సుమారు 2,300 మంది నిరుద్యోగులకు ఆఫ్‌లైన్‌లో శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఆ శిక్షణ పొందిన వారిలో 462 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారని వెల్లడించారు.ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేసిన సందర్భాలు తనను ఎంతగానో కదిలించాయని, వారి ఆనందాన్ని చూసి తన కళ్లలో నీళ్లు తిరిగాయని మంత్రి భావోద్వేగంగా పేర్కొన్నారు. ఆ అనుభవమే మరింతమంది నిరుద్యోగ యువతకు శిక్షణ అందించాలనే సంకల్పానికి ప్రేరణగా నిలిచిందన్నారు. గతంలో ఒక ప్రాంతానికి పరిమితమైన శిక్షణను ఇప్పుడు ఆన్‌లైన్ విధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

**ఇంటి వద్ద నుంచే నాణ్యమైన శిక్షణ..**

ప్రస్తుత ఆన్‌లైన్ శిక్షణ విధానం వల్ల అభ్యర్థులు హైదరాబాద్ కు రాకుండానే తమ ఇళ్ల వద్ద నుంచే శిక్షణ పొందవచ్చని మంత్రి తెలిపారు. దూర ప్రాంతాల్లో నివసించే యువతకు ప్రయాణ ఖర్చులు, వసతి తదితర ఇబ్బందులు లేకుండా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. నాణ్యమైన శిక్షణ అందరికీ అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.ఒక్కో అభ్యర్థికి ఇలాంటి శిక్షణ అందించేందుకు సాధారణంగా కనీసం రూ. లక్ష వరకు ఖర్చవుతుందని, పుస్తకాలు, ఇతర శిక్షణా సామగ్రి కోసమే సుమారు రూ.14 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యయం అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఖర్చులన్నింటినీ ట్రస్ట్ భరిస్తుందని, అభ్యర్థులకు శిక్షణతో పాటు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.

**లక్ష మందికి పైగా నమోదు..**

**ఎంతమందికైనా శిక్షణ..**

'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమంపై తొలుత కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, ఉచిత శిక్షణ నిజంగానే అందిస్తున్నట్లు తెలుసుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో యువత పేర్లు నమోదు చేసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ప్రకటన విడుదల చేసిన పది రోజుల్లోనే లక్ష మందికి పైగా అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవడం ఈ కార్యక్రమంపై యువత చూపుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమానికి ఎలాంటి కటాఫ్ తేదీ విధించలేదని, లక్ష మందితోనే పరిమితం కాకుండా ఎంతమంది అభ్యర్థులు ముందుకొచ్చినా శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది వరకు ఏడాది పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని, అవసరమైతే శిక్షణా కాలాన్ని మరింత పొడిగిస్తామని తెలిపారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతీ యువకులందరికీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

**త్వరలో మరో 15 వేల ఉద్యోగాల భర్తీ..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి గారు తెలిపారు. ఇప్పటికే రెండేళ్లలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొన్నారు. త్వరలో సుమారు మరో 15 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యోగాల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్లు వెలువడనున్నాయని చెప్పారు.ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్న మంత్రి.. ఆ దిశగా 'పీఎస్ఆర్ యువ నేస్తం' కార్యక్రమం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక పరిస్థితులు, శిక్షణ ఖర్చులు, దూరప్రాంతాల సమస్యలు యువత లక్ష్యసాధనకు అడ్డంకులు కాకూడదనే ఉద్దేశంతోనే ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్న ప్రతి నిరుద్యోగ యువతీ యువకుడికి ఈ కార్యక్రమం ఒక అవకాశంగా నిలవాలని, యువత తమ ప్రతిభను నిరూపించుకొని ఉద్యోగాలు సాధించేలా ఈ వేదిక తోడ్పడాలని మంత్రి ఆకాంక్షించారు.

**దీపావళి లోగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈరోజు కలిసిన సందర్భంలో పాత్రికేయుల ఇళ్ల స్థలాల అంశం చర్చకు వచ్చిందని మంత్రి పొంగులేటి తెలిపారు. రానున్న దీపావళి లోగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి సమ్మతించారని తెలిపారు. దీనివలన దీర్ఘకాలిక సమస్య తీరుతుందన్నారు. దీనిపై పాత్రికేయుల స్పందిస్తూ మంత్రిగారి పుట్టినరోజున తమకు శుభవార్త వచ్చిందని హర్షం వ్యక్తం చేశారు.

# రబీ సాగుపై ఎల్‌నినో పంజా

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దేశంలో వ్యవసాయ రంగంపై ఆందోళన పెంచుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ (వర్షాకాలం) పంటల సీజన్‌ను అతలాకుతలం చేసిన ఎల్‌నినో ప్రభావం ఇప్పుడు రబీ (శీతాకాలం) పంటలపైనా తీవ్రంగా పడుతోంది. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో వాతావరణ సమతుల్యత పూర్తిగా దెబ్బతింది. దీని వల్ల పొలాల్లో తగినంత తేమ లేక రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేలలో తేమ తగ్గడం సహా సాగునీటి లభ్యతపై ఆందోళనల కారణంగా గోధుమలు, శనగలు సహా పలు పంటల సాగు నెమ్మదించింది. ఈ ఎల్‌నినో రబీ పంటల విత్తనాలు వేసే ప్రక్రియను తీవ్రంగా ప్రభావితం చేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదిక ఈ ఆందోళనకరమైన పరిస్థితుల్ని కళ్లకు కట్టింది.

**సగానికిపైగా పడిపోయిన గోధుమల సాగు..**

సాధారణంగా గోధుమల సాగు కాలం దేశంలో అక్టోబర్ నుంచి నవంబర్ వరకు ఉంటుంది. మార్చి ఏప్రిల్ నాటికి కోతకు వస్తుంది. అయితే కేంద్ర వ్యవసాయ శాఖ రిపోర్ట్ ప్రకారం గత పంటల కాలం (202526) అక్టోబర్ 23వ తేదీ గణాంకాలతో పోలిస్తే, ప్రస్తుత పంటల సంవత్సరంలో (202627) గోధుమల సాగు విస్తీర్ణం ఏకంగా 59 శాతం క్షీణించింది. గతేడాది ఇదే సమయానికి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 27 వేల (0.27 లక్షలు) హెక్టార్లలో గోధుమ విత్తనాలు వేయగా, ఈసారి చూస్తే అది కేవలం 11 వేల (0.11 లక్షలు) హెక్టార్లకే పరిమితమైంది. గోధుమలతో పాటు శనగలు, అన్ని రకాల పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం కూడా భారీగా పడిపోయింది. గతేడాది అక్టోబర్ 23 నాటికి 3.77 లక్షల హెక్టార్లలో శనగలు సాగు చేయగా, ఈసారి 2.21 లక్షల హెక్టార్లకే పరిమితమైంది. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగు తగ్గడం కూడా ఆహార సరఫరాపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**రాజస్థాన్‌లోనే 58 శాతం తగ్గిన రబీ సాగు..**

రాజస్థాన్ రాష్ట్రంలో రబీ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గోధుమలు, ఆవాలు, బార్లీ, శనగలు, కందులు, బఠానీలు వంటి పంటలు కలిగి గతేడాది ఇక్కడ అక్టోబర్ 23 నాటికి 14.13 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. ఈ ఏడాది అదే తేదీ నాటికి చూస్తే 5.93 లక్షల హెక్టార్లలోనే సాగు జరిగింది. ఇక్కడ రికార్డు స్థాయిలో 8.21 లక్షల హెక్టార్ల మేర తగ్గుదల నమోదైంది. ఇది దాదాపు 58 శాతానికి సమానం. తమిళనాడులో కూడా రబీ సాగు విస్తీర్ణం సగానికి సగం తగ్గింది. యూపీలో స్వల్పంగా ప్రభావం కనిపిస్తోంది. మధ్యప్రదేశ్‌లో గతేడాది 0.20 లక్షల హెక్టార్లలో రబీ సాగు కాగా, ఈసారి అసలు నమోదు కాలేదు. ఉత్తరాఖండ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. కేరళంలో గతేడాది 0.14 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.11 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది. ఇలా దేశవ్యాప్తంగా 2026, అక్టోబర్ 23 వ తేదీ నాటికి చూస్తే రబీ పంటల మొత్తం సాగు విస్తీర్ణం 18.02 లక్షల హెక్టార్లుగా ఉంది. గతేడాది ఇదే తేదీ నాటికి ఇది ఏకంగా 28.26 లక్షల హెక్టార్లుగా ఉండటం గమనార్హం. ఎల్‌నినో కారణాలతో ఈసారి 10.24 లక్షల హెక్టార్ల వరకు తగ్గుదల నమోదైంది. ఈసారి శీతాకాలంలో వరి సాగు విస్తీర్ణం కూడా సగానికి సగం తగ్గింది. ఇదిలా ఉండగా, జొన్న, సజ్జ, రాగులు, ఇతర చిరుధాన్యాలు వంటి వాటి సాగు విస్తీర్ణం మాత్రం 13 వేల హెక్టార్ల నుంచి ఈసారి 23 వేల హెక్టార్లకు పెరగడం విశేషం. అయితే అన్ని రాష్ట్రాల్లో సాగు తగ్గలేదు. కర్ణాటకలో రబీ పంటల సాగు విస్తీర్ణం 1.80 లక్షల హెక్టార్ల నుంచి 1.91 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 0.23 లక్షల హెక్టార్లతో పోలిస్తే ఈసారి 0.37 లక్షల హెక్టార్లలో సాగు నమోదైంది.భారత వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో రుతుపవనాల సీజన్‌లో జూన్ సెప్టెంబర్ మధ్య దేశంలో సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. పంజాబ్‌లో సాధారణం కంటే 38 శాతం, రాజస్థాన్‌లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ చివరినాటికి ఈ రాష్ట్రాల్లోని జలాశయాల్లో నీటి నిల్వలు కూడా తక్కువగా ఉన్నాయి. దేశంలోని మొత్తం గోధుమ సాగు విస్తీర్ణంలో పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల వాటానే 31 శాతంగా ఉండగా, ఈ రాష్ట్రాల్లోనే ఇప్పుడు ఎక్కువగా సాగు విస్తీర్ణం తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

# కాంగ్రెస్ ధర్నా కేవలం పొలిటికల్ డ్రామా

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఢిల్లీలో జరగనున్న ఇండియా కూటమి ర్యాలీ కోసం ప్రత్యేక రైళ్లు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసనలపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. బుధవారం ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. ముందస్తు బుకింగ్, ముందస్తు చెల్లింపులు లేకుండా ప్రత్యేక రైళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం ఎదుట కాంగ్రెస్ నాయకులు ధర్నా చేయడం కేవలం పొలిటికల్ డ్రామా అని రామచందర్ రావు మండిపడ్డారు. స్పెషల్ ట్రైన్లు కేటాయించడానికి స్పష్టమైన నిబంధనలు, అధికారిక ప్రక్రియలు ఉంటాయని ఆయన గుర్తుచేశారు. ముందస్తుగా దరఖాస్తు చేసుకోవడంతో పాటు అడ్వాన్స్ నిధులు చెల్లించాల్సి ఉంటుందని, అలా ఏమీ చేయకుండా ఉన్నపళంగా రైళ్లు కావాలని పట్టుబట్టడం కామెడీగా ఉందన్నారు. అయితే, దేశవ్యాప్తంగా దసరా నుంచి దీపావళి వరకు పండుగల సీజన్ నడుస్తోందని, సౌత్ సెంట్రల్ రైల్వే ఇప్పటికే ప్రయాణికుల రద్దీ కోసం వెయ్యికి పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతోందని తెలిపారు. ఇలాంటి టైమ్‌లో రైళ్లు, కోచ్‌ల లభ్యత చాలా కీలకమైన అంశమని రాంచందర్ రావు పేర్కొన్నారు. అంతగా ఢిల్లీకి వెళ్లాలనుకుంటే కాంగ్రెస్ నాయకులు టికెట్లు కొనుగోలు చేసి సాధారణ రైళ్లలో, విమానాలు, బస్సుల్లో వెళ్లవచ్చని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వ్యవస్థల ప్రతిష్టను దిగజార్చేందుకే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని రాంచందర్ రావు ఫైర్ అయ్యారు.

# సరూర్ నగర్ జూనియర్ కళాశాలలో మెరిసిన ఆణిముత్యాలు




విశ్వంభర, సరూర్ నగర్ : సరూర్నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతూ క్రీడలలో విశేష ప్రతిభను చూపించి ఫుట్ బాల్ అండర్ 17 విభాగంలో లలిత్ తేజ్ ఎం పి సి సెకండ్ ఇయర్, ఆకాష్ సెకండ్ ఇయర్ (బాయ్స్)లు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలువగా , అండర్ 19 పుట్ బాల్ బాలుర విభాగంలో శరత్ కుమార్ సెకండ్ ఇయర్, గాంధి సెకండ్ ఇయర్,. ధోని ఫస్ట్ ఇయర్ లు మొదటి స్థానంలో నిలిచారు. అండర్ 19 బాలికల విభాగంలో . మధు ప్రియ . హరిణి సెకండ్ ఇయర్,తృతీయ స్థానంలో నిలిచారు. రగ్బీ ఆటలో అండర్ 19 బాలికల విభాగంలో హరిణి,. మధు ప్రియ మొదటి స్థానంలో నిలవగా, అండర్ 19 బాలుర విభాగంలో . గాంధీ ద్వితీయ సంవత్సరం, ఇశాంత్ . పరమ సింహతేజ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిలో పరమ సింహతేజ మరియు ఇషాంత్, లలిత్ తేజ్ లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ అనురాధ అధ్యాపక,అధ్యాపకేతర బృందం ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో ముఖ్యమని, క్రీడల ద్వారా శారీరక,మానసిక ఉల్లాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు.

# జిల్లా వైద్యాధికారికి సన్మానం

**విశ్వంభర, సరూర్ నగర్ :** ఇటీవల జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ తరఫున జిల్లా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలు ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్ మంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ బి. పరాంకుశం, పి.శ్రీనివాసులు, ఎండీ షాయాద్, చిట్టిబాబు, ఎండీ రఫీక్, కళమ్మ పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణకు పితృవియోగం

విశ్వంభర, నార్కట్ పల్లి : నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్ పల్లి మండలం, అమ్మనబోలు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ తండ్రి కాచం బిక్షమయ్య (86) బుధవారం రోజు గుండెపోటుతో మరణించగా, విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, నల్గొండ మాజీ శాసన సభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి, నకరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య, పల్లె వినయ్ కుమార్, బండ నరేందర్ రెడ్డి, బీజేపీ నాయకులు దాసరి మల్లేశం వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి, స్థానిక నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఎల్లమ్మ కల్యాణం, పుట్టమన్ను మైలపోలు కార్యక్రమం

**విశ్వంభర, హయత్ నగర్ :** పెద్ద అంబర్‌పేట-కోహెడ రోడ్డులోని సాయి సాయి శ్రీనివాస బాటిల్ కంపెనీలో నిర్వహించిన ఎల్లమ్మ కల్యాణం, పుట్టమన్ను మైలపోలు, అంగరంగ వైభవమైన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు ఎల్లమ్మ తల్లులకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్ల కృపాకటాక్షాలు కంపెనీపై ఎల్లప్పుడూ ఉండాలని, సంస్థ నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు. అనంతరం కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త వస్త్రాలను పంపిణీ చేశారు. కార్మికులతో ఆత్మీయంగా మెలుగుతూ వారికి వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త సతీమణి ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్, చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ, వైష్ణవి, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, కార్మికులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



బహదూర్పుర మండలంలో

# జిల్లా విద్యాశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, చార్మినార్ :** పాతబస్తీలోని ప్రభుత్వ బాలుర అందుల పాఠశాలలో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు .తనిఖీల్లో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీయడం జరిగింది. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని , మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. తర్వాత విద్యార్థులతో ముచ్చటిస్తూ విద్యార్థులు బ్రెయిలీలో ఏ విధంగా చదువుతారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులల్లో వివిధ రకాల నైపుణ్యాలను చూసి వారిని అభినందించారు. ప్రభుత్వం నుంచి ఏమైనా సహాయ సహకారాలు కావాలంటే విద్యార్థులకు అందించడానికి కృషి చేస్తామని అన్నారు. విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారని చదువుతో పాటు ఇతర రంగాలలో కూడా ఆసక్తి ఉన్నదని మంచి నైపుణ్యం కలవారుగా ఉన్నారని విద్యార్థులను అభినందించారు. డీఈవో తో పాటు బహదూర్పు మండల విద్యాశాఖ అధికారి సుమన్ , డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ యాదగిరి , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఇంచార్జి సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటరెడ్డి , ఇతర ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ ఉన్నారు.




# శిథిలావస్థకు చేరిన పశువైద్యశాల

**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్‌నగర్ పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. స్లాబు, గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే గదులన్నీ జలమయమవుతున్నాయి. పశువుల చికిత్స కోసం తెచ్చిపెట్టిన మందులు, ఇతర వస్తువులు తడిసి పాడవుతున్నాయి. అంతేకాదు తరచూ పైకప్పు పెచ్చులూడి పడుతోంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పశువైద్యులు బిక్కు బిక్కుమంటూ పని చేయాల్సిన దుస్థితి తలెత్తింది.




**రోజుకు 70 నుంచి 80 జంతువులు**

గాలికుంటు వ్యాధు, గొంతువాపు, నట్టల నివారణ, తదితర అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న పశువులు, కుక్కలను చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకొస్తుం టారు. ఇలా రోజుకు సగట ౦న 70 నుంచి 80 వరకు వస్తుంటాయి. జంతువులతో పాటు వాటి యజమానాలు వస్తుంటారు. ఆస్పత్రి భవనం నిర్మించి 50 ఏళ్లు దాటింది. ఎప్పకప్పుడు రిపేర్లు చేయకపోవడం తో ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే స్లాబు, గోడల నుంచి నీరు లీకవుతుంది. తరచూ పైకప్పు పెచ్చులూడి మీద పడుతుం డటంతో ఇక్కడ విధులు నిర్వహించే ందుకే వైద్యులు భయపడుతున్నారు.

**ప్రత్యామ్నాయం లేక అక్కడే..**

సరూర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఏడు డెయిరీ ఫాంలు ఉన్నట్లు అంచనా, వీటిలో ఆవులు, గేదె లు వెయ్యికిపైగా ఉన్నట్లు అంచనా. సాధారణ చికిత్సలతో పాటు కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేస్తుంటారు. పశు వైద్యంలో కీలకమైన ఈ ఆస్పత్రి భవనాన్ని ఖాళీ చేయాల్సిందిగా జీహెచ్ఎంసీ ఐదేళ్ల క్రితమే నోటీసులు జారీ చేసింది. అయితే ప్రత్యామ్నాయం లేకపోవడంతో అక్కడే చికి త్సలు అందించాల్సి వస్తుందని పశు వైద్యులు అభి ప్రాయపడుతున్నారు. ఈ సమయంలో పైక ప్పు పెచ్చులూడి పడుతుండటంతో పశువుల వెంట వచ్చిన రైతులు తలకు గాయాలై ఆస్పత్రు ల్లో చేరాల్సిన దుస్థితి తలెత్తింది.

**ప్రైవేటుకు వెళ్తే ఒక్కో ఇంజక్షన్‌కు రూ.వెయ్యి**

కుక్కలకు యాంటి రేబిస్ ఇంజక్షన్లు ఇప్పించాల్సి ఉంది. ప్రైవేటులో ఒక్కో ఇంజక్షన్‌కు రూ.వెయ్యికిపైగా ఛార్జీ చేస్తుంటారు. అదే ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలాంటి ఫీజులు ఉండవు. శిథిలావస్థకు చేరిన సరూర్‌నగర్ పశువుల దవఖానాను వెంటనే పునరుద్ధరించాలి. మూగ జీవాలకు వైద్య సేవలు అందేలా చూడాలి.

**పెచ్చులూడి పడుతోంది**
**- డా. సీహెచ్ అజయ్‌వీర్ రెడ్డి**




సరూర్‌నగర్ పశువుల ఆస్పత్రిలోపల పై భాగం పెచ్చులూడి పడుతోంది. తలపై పడటంతో గాయాలవుతున్నాయి. భయంతో బయటే టేబుల్ వేసుకుని కూర్చోవాల్సి వస్తుంది. ఉదయం 10 తర్వాత ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అక్కడ కూడా కూర్చొలేని దుస్థితి. అత్యవసర పరిస్థితుల్లో వంటికి, రెంటికి భయటికి పరుగులు తీయాల్సి వస్తుంది. కనీసం తాగేందుకు మంచినీరు కూడా లేకపోవడం ఇబ్బందిగా మారింది.


రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్,
మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్,
దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108